క్లుప్తంగా

నేడు మదన గోపాలుని నిత్యమాస కల్యాణం



పాలమూరులో వేంచేసివున్న రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి

అనపర్తి: మండలంలోని పాలమూరులో వేంచేసివున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీమదనగోపాలస్వామి వారి నిత్యమాస కల్యాణం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా వైఖానస ఆగమ విధానంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటలకు పండితులు వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును జరపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీకృష్ణ ఏకాదశ దీక్షా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల హర్షం



వెంకటాపురంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న గృహ సారథులు, నాయకులు

రంగంపేట: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో వారు చూపిస్తున్న ఆదరణే అందుకు నిదర్శనమని సర్పంచ్ ముంగి గంగరాజు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మాగాపు వెంకట రమణ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నురుకుర్తి సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోడెం విష్ణు, అంచూరి ఏసుబాబు, ముంగి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి



కొవ్వూరి వెంకట రాఘవరెడ్డి(ఫైల్)

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కొవ్వూరి వెంకట రాఘవరెడ్డి(51) శనివారం మృతి చెందాడు. ఆయన మోఘ్లూరు ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద బాత్‌రూంలో జారి పడగా తలకు గాయమైంది. రాజమహేంద్రవరంలోని డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

వీరజవాన్లకు నివాళులు

రాజమహేంద్రవరం రూరల్: ఈనెల 20న జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్లకు బీజేపీ జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాత్రి బొమ్మూరు సెంటర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరగబోయే అంతర్జాతీయ జీ–20, శిఖరాగ్ర సమావేశం ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా భారత ప్రభుత్వాన్ని భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో ఉగ్రవాదులు ఈ దాడి చేశారన్నారు. ఈ దుశ్చర్యకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్వీబీఎన్ ఆచారి, మల్లాడి సత్య వరప్రసాద్, ఆకుల నరేష్, ముద్రగడ సూర్య చంద్ర మోహన్, మల్లాది శశికాంత్, బండారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మన భూమి ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ టీచర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నేస్తం... కొబ్బరి బొండాం

- ఏడీబీ రోడ్డులో జోరుగా విక్రయాలు
- లీటర్ నీరు రూ.100



ఏడీబీ రోడ్డులో విక్రయిస్తున్న కొబ్బరి బొండాలు

రంగంపేట: వేసవి ఎండలకు మాడు పగిలిపోతోంది. ఉష్ణ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ద్రవ పదార్థాలను ఆశ్రయిస్తున్నారు. చాలా మంది కొబ్బరి నీరు తాగేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. కొబ్బరి నీరు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఎన్నో పోషక విలువలతో పాటు శరీరానికి తక్షణ శక్తిని ప్రసాదించే గుణాలుండటంతో ఎక్కువ మంది కొబ్బరి బొండాలు తాగుతున్నారు. దీంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ బాగా పెరిగింది. ముఖ్యంగా ఏడీబీ రోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు కొబ్బరి బొండాల వద్ద ఆగి తాగి సేదతీరుతున్నారు. రాజానగరం నుంచి సామర్లకోట వరకు ఏడీబీరోడ్డు వెంబడి అనేక చోట్ల కొబ్బరి బొండాల విక్రయాలు జరుపుతున్నారు. దీంతో వేల సంఖ్యలో బొండాలు అమ్ముడవుతుండగా పలువురికి ఉపాధి లభిస్తుంది.

పెరిగిన డిమాండ్

కొబ్బరినీళ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. షుగర్ రోగుల్లో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి. ఎండలో ప్రయాణాలు చేసేటప్పుడు చెమట రూపంలో లవణాలు నష్టపోయిన కారణంగా ఏర్పడే నిర్జలీకరణ స్థితి నుంచి రక్షిస్తాయి. శరీరాన్ని చల్లబరుస్తూ ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. కేన్సర్ నిరోధకంగానూ పని చేస్తాయి. మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పకుండా మూత్రకోశ సంబంధిత వ్యాధుల నివారణకు దోహదపడతాయి. అందుకే ఎండలో ప్రయాణించే వారితో పాటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న వారి వరకూ నిత్యం కొబ్బరి బొండాలను కొనుగోలు చేస్తున్నారు. కూల్‌డ్రింకులు, జ్యూస్‌లు, పళ్లరసాల కన్నా కొబ్బరినీరు మంచిది కావడంతో కొబ్బరిబొండాలకు డిమాండ్ పెరిగింది. ఫిబ్రవరి నెల వరకూ బొండాం రూ.15 ఉండగా ఇప్పుడు రూ.20 నుంచి రూ.25 వసూలు చేస్తున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు



షాపుల్లో అమ్మే కూల్ డ్రింకులతో ఎలాంటి ఉపయోగం ఉండదు. కొబ్బరి నీళ్లు తాగితే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. డాక్టర్లు కూడా కొబ్బరి నీళ్లు తాగమని చెబుతున్నారు. అందుకే కొబ్బరి నీళ్లు తాగేవారి సంఖ్య పెరుగుతుంది.

– కేసిమిల్లి రవణమ్మ, కొబ్బరి బొండాల వ్యాపారి, రంగంపేట

లీటర్ బాటిళ్లలో కొబ్బరి నీరు

ఎండలో ప్రయాణాలు సాగించేవారితో పాటు ఇళ్లకు తీసుకెళుతుండడంతో కొబ్బరి నీళ్లను లీటర్ల చొప్పున ఖాళీ వాటర్ బాటిళ్లలో పోసి అమ్ముతున్నారు. లీటర్ కొబ్బరి నీరు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ఆసుపత్రుల్లో ఉన్న వారికి తీసుకెళ్లడానికి కూడా అనువుగా ఉండటంతో ఎక్కువ మంది కొబ్బరినీరు బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు.

ఎన్జీటీలో విచారణ 27కు వాయిదా

సీతానగరం: నియమ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద సీతానగరం పీఏసీఎస్ నిర్మిస్తున్న పెంట్రోల్ బంకుపై ఎన్జీటీలో జరుగుతున్న విచారణ ఈనెల 27కు వాయిదా వేసినట్టు పిటీషనర్, న్యాయవాది చిడిపి నకుల సురేష్ శనివారం తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ 2022 మార్చి 13న ఎన్‌జీటీని ఆశ్రయించామని దీనిపై ఈనెల 19న జరిగిన విచారణలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పెట్రోల్ బంక్ నిర్మాణం నియమ నిబంధనలు ఉల్లంఘించారని ఎన్జీటీకి తెలియజేశారన్నారు. ప్రభుత్వ న్యాయవాది, ఇండియన్ ఆయిల్ కంపెనీ తరపు న్యాయవాదిని పెట్రోల్ బంకు నిర్మిస్తున్న స్థలం వర్గీకరణ వివరాలను తెలియపరచాలని, పెట్రోల్ బంకు నిర్మిస్తున్న స్థలం చెరువుగా ఉండేదని అడంగల్ స్పష్టం చేస్తుందని ఎన్జీటీ గౌరవ న్యాయమూర్తి వ్యాఖ్యనించి, తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా వేశారని, పిటీషన్, న్యాయవాది నకుల సురేష్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికే అధిక ప్రాధాన్యం



నిడిగట్లలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే అధిక ప్రాధాన్యమిస్తున్నారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో రెండో రోజు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకూ కొనసాగింది. 120 గడపలకు వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు నాళం రోషయ్య, యడ్ల సత్యనారాయణ, పళ్ల కృష్ణ, కొల్లం రాజారమాదేవి, వల్లభశెట్టి బాబ్జి, గొంతు లక్ష్మణ్, బధిరెడ్డి యేసు, పళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన ఎస్.నరేష్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభోశేఖర్ శనివారం తెలిపారు. ఈనెల 21 రాత్రి 11.30 గంటలకు బాలికపై నరేష్ తన గదిలోకి తీసుకెళ్లి నోటిలో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడని, బాలిక తల్లి మట్ట దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై శుభోశేఖర్ తెలిపారు.

చెట్లు నరికిన వారిపై కేసు

సీతానగరం: వంగలపూడిలోని పంటపొలంలో ఉన్న మామిడి చెట్టు, మూడు టేకు చెట్లు, నాలుగు సరుగుడు చెట్లను అల్లం వీరవెంకట సత్యనారాయణతోపాటుగా మరో ఏడుగురు నరికివేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ టి.లోవకుమార్ శనివారం తెలిపారు. ఈనెల 12న పార్వతి తన పొలంలోకి వెళ్లిన చూడగా చెట్లు నరికివేసినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతానగరం: ఈ నెల 20న మిర్తిపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రేముల రాజేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై శనివారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ తెలిపారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



స్థానిక మహిళకు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అచ్యుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అచ్యుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు టీడీపీ నాయకులే పొందారన్నారు. జగనన్న సీఎం అయ్యాక తమ ఇళ్ల ముంగిటకే పథకాలు అందుతున్నాయంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా, పార్టీల ప్రమేయం లేకుండా, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, స్థానిక సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, కర్రి సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పెండెం వీరబాబు, సాంబత్తుల చంటి, గుత్తుల వెంకటరమణ, కర్రి శ్రీవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల్ని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్
- జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

పెదపూడి: మహనీయుల్ని ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. శహపురంలో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పారిశ్రామికవేత్త ఎంఎల్ఎస్ బాలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు ఆశయాలను అమలు చేస్తున్న గొప్ప మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర చరిత్రలో బీసీలను అనగా పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను రాజ్యసభకు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇచ్చిన గొప్ప ముఖ్యమంత్రి అని చెప్పారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎలాంటి పైరవీలు లేకుండా ఎమ్మెల్సీ పదవినిచ్చిన నిస్వార్థ సీఎం జగన్ అని కొనియాడారు. అనంతరం విగ్రహాలు ఏర్పాటు చేసిన దాతలు చందాళ్ల పార్వతి, వెంకటరమణ దంపతులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు డొకుబుర్ర భద్రం, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు, బుద్దాల శ్రీను, దళిత యువసేన ప్రతినిధులు వల్లూరి రవికుమార్, వల్లూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూముల సాధనే లక్ష్యం



రంపయర్రంపాలెంలో సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ వేడుకలు

గోకవరం/రాజానగరం/సీతానగరం/మధురపూడి: గోకవరం మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు బాదంపూడి బాబూరావు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు వెంకటేశులు పాల్గొన్నారు.

రాజానగరంలో..

రాజానగరంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఆ పార్టీ జిల్లా నాయకులు పండెల సోమన్న పార్టీ జెండాను ఎగురవేశారు. రాజానగరం మండలంలోని పాతతుంగపాడు, రాజానగరంలలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పోటాపోటీగా నిర్వహించారు.

సీతానగరంలో సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రెసిడెంట్ సిద్ధి నాగరాజు, మహిళా సభ్యురాలు పలివెల జ్యోతి, చిట్టిస్వామి తదితరులు పాల్గొన్నారు

కోరుకొండ రాఘవనగర్‌లో శనివారం పార్టీ 54వ ఆవిర్భావ దినోత్సవం, కమ్యూనిస్టు నేత లెనిన్ జయంతి సందర్భంగా సభ నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పి.వెంకటనాయుడు, పార్టీ నాయకులు పాలెపు రామారావు, సూర్యనారాయణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు చర్యలు

కడియం: ధాన్యం రవాణాలో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన కడియంలోని ఆవ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ధాన్యం రవాణా విషయంలో తమకు అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో స్వయంగా పరిశీలించేందుకు వచ్చినట్టు జేసీ తెలిపారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణ పూర్తిగా ఆన్‌లైన్ నమోదు విధానం ద్వారానే సాగుతుంది. గత ఖరీఫ్‌లో ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన లావాదేవీలకు ఇంకా 512 మెట్రిక్ టన్నులకు చెల్లింపులు జరగలేదన్నారు. వీటిని సంబంధిత మిల్లర్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రవాణా సదుపాయం అందుబాటులో లేని భూముల నుంచి ధాన్యాన్ని ఎడ్ల బళ్ల ద్వారా రవాణా చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి సూచనలు స్వీకరించారు. రైతుకు మద్దతు ధర లభించేలా పకడ్బందీగా కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు జేసీ చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీఎస్‌వో పి.ప్రసాదరావు, ఏయం త్రినాథరావు, తహసీల్దార్ ఎం.సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు), కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



అనపర్తి ముఖరం మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



సీతానగరం అజిజియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న చిన్నారులు



కోరుకొండ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనపర్తి: ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండగ రంజాన్‌ను ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులకు చేరుకున్న ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా మండలంలోని కుతుకులూరు, అనపర్తి బాబానగర్‌లో ముఖరం మసీదు, పాత ఊరులోని అంజుమాన్ నూర్ ఇస్లాం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. ప్రతిఒక్కరూ పరోపకార గుణాన్ని అలవరచుకుని దైవం చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని ఉద్బోధించారు.

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, సంపర, పెద్దాడ గ్రామాల్లో ముస్లిం సోదరులు ఉదయం మసీదులకు వెళ్లి ఈదుల్ ఫీతర్ నమాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లో మత పెద్దలు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఓర్పు, సహనం, దాతృత్వం, ఆధ్యాత్మికత గుణాలు కలిగి ఉండటమే రంజాన్ అని అన్నారు. అనంతరం చిన్నారులు, పెద్దలు ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

బిక్కవోలు: నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలను పాటించిన ముస్లిం సోదరులు శుక్రవారం సాయంత్రం షవ్వాల్ నెల వంకను వీక్షించడంతో దీక్షలను విరమించి శనివారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. బిక్కవోలులోని మదీనా మసీదు వద్ద ఇమామ్(గురువు) మొహమ్మద్ షజాహద్ అష్రఫీ ప్రత్యేక నమాజ్ చేసి రంజాన్ సందేశం వివరించారు. పందలపాక బిలాల్ మసీదు మత గురువు మౌలానాషేక్ గులాం గౌస్ రిజ్వి సందేశం ఇచ్చారు.

మధురపూడి: రంజాన్ వేడుకలు శనివారం కోరుకొండలో ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు మత గురువు సయ్యద్ ఇస్మాయిల్ ఈద్–ఉల్–ఫితర్ నమాజులు చదివించారు. దేశంలో సంక్షేమం, ప్రజల ఆరోగ్యం కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీదు నాయకులు షేక్ సుభాన్, భాష, మొహిద్దీన్, వక్ఫ్ బోర్డు సభ్యులు బిజిలని, షేక్ చంటి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని జుమ్మామసీదు, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని జామియా మసీదులో ఉదయం నుంచి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

సీతానగరం: మండలంలో రంజాన్ వేడుకలు ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. శనివారం స్థానిక అజీజియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం చేశారు. మసీదు మిమామ్ ఆఫీస్ ముస్తాక్ అంసారీ రంజాన్ పండగ ఘనతను వివరించారు. మోజన్ షేక్ ఉమర్ షరీఫ్, మసీదు సభ్యులు సయ్యద్ కరీముల్లా, షేక్ నగీన్‌షా, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాంక్షతోనే నిరాధార ఆరోపణలు

సీతానగరం: జిల్లా వాలీబాల్ సంఘ అధ్యక్ష పదవిని మరిన్ని ఏళ్లు పొడిగిస్తూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పేర్కొంటూ ఎ.రామరాజు అమలాపురంలో ఇచ్చిన ప్రకటనలోని ఆరోపణలు అవాస్తవమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి యార్లగడ్డ బంగార్రాజు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈనెల 16న రాజమహేంద్రవరంలో జరిగిన ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగలేదని, పూర్తి కోరం లేకుండా ఎన్నికలు జరిగాయని తెలియజేశారు. ఎనిమిది మంది సభ్యులలో కార్యదర్శి అయిన తనకు నలుగురు కార్యవర్గ సభ్యులకు తెలియజేయకుండా, కోరం లేకుండా, ముందస్తు ప్రకటన చేయుండా సమావేశం నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్‌లో అసలు సభ్యత్వం లేని వారిని ఏకంగా కార్యదర్శిగా ఎంపిక చేసిన విధానం సాప్ వాలీబాల్ అసోసియేషన్, ఒలింపిక్ అసోసియేషన్ నిబంధనలకు పూర్తి వ్యతిరేకంగా, ఏకపక్షంగా చట్ట వ్యతిరేకంగా జరిగిందని, అవి చెల్లదని ఇది వరకే తెలియజేశానన్నారు. 2017లో టోర్నమెంట్‌కు సంబంధించిన జమా ఖర్చులన్నీ పారదర్శకంగా ఆడిట్ చేయించి, వాటిని రామరాజు అధ్యక్షత వహించిన సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం ముందుంచి ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. ఇప్పుడు గత పాలకవర్గ పదవీకాల సమయంలో రూ.3 లక్షలు నిధులు దుర్వినియోగం అయ్యాయని రామరాజు ఆరోపణలను ఆయన ఖండించారు. రాజమహేంద్రవరంలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా నిర్వహించిన అక్రమ ఎన్నికలను సమర్థించుకోవడానికి మాత్రమే రామరాజు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఒలంపిక్ అసోసియేషన్ వారి దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరతామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బంగార్రాజు వివరించారు.